తిరంగా జెండా.. ప్రజల మదినిండా..

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గరువారం భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, బీఆర్ఎస్ కార్యాలయాలు, సొసైటీ కార్యాలయాలు, పోలీసు స్టేషన్లు, వివిధ పార్టీల అనుబంధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతి వాడలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు విచిత్ర వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణ త్యాగాలతో, బలిదానాలతో ఈనాడు మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామని, వారి త్యాగాలను మరవకూడదని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ దేశభక్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమాల్లో టీఆర్ఎస్ నాయకులు, అధికారులు, సీఐలు, ఎస్సైలు, ప్రజాప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

- నమస్తే నెట్‌వర్క్

టేకులపల్లి : బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

మణుగూరు టౌన్: బీఆర్ఎస్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

సింగరేణి : జెండా వందనం చేస్తున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం టౌన్ : జడ్పీ కార్యాలయంలో జెండా ఎగురవేసి మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

కోర్టు ప్రాంగణంలో జెండా ఎగురవేస్తున్న ఇల్లెందు జడ్జి కీర్తి చంద్రికరెడ్డి

కొత్తగూడెం క్రైం : జెండా ఆవిష్కరించి గీతాలాపన చేస్తున్న ఎస్పీ రోహిత్ రాజు, అధికారులు

పాల్వంచ : కేటీపీఎస్‌లో మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు

లక్ష్మీదేవిపల్లి : బెటాలియన్‌లో గౌరవ వందనం చేస్తున్న కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

చుంచుపల్లి : జెండా ఎగురవేస్తున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

అశ్వారావుపేట టౌన్ : క్యాంప్ కార్యాలయంలో జెండా గురవేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

మణుగూరు టౌన్: ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే పాయం ..

పాల్వంచ : మున్సిపల్ కార్యాలయంలో..

రామవరం : జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఏరియా జీఎం శాలెంరాజు

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన బీఆర్ఎస్ నాయకులు

మణుగూరు టౌన్: బీటీపీఎస్‌లో సీఈ బిచ్చన్న..

ఇల్లెందు రూరల్ : ఏరియా జీఎం జాన్ ఆనంద్..

అన్నపురెడ్డిపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో..

అన్నపురెడ్డిపల్లి : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు

టేకులపల్లి : జెండా ఆవిష్కరిస్తున్న సీఐ సురేశ్

దమ్మపేట : జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నరేష్

సింగరేణి : విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పాల్వంచ : జెండా ఎగురవేస్తున్న టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్

చుంచుపల్లి : జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ కృష్ణ

చంద్రుగొండ : దేశనాయకుల వేషధారణలో చిన్నారి

అశ్వారావుపేట టౌన్ : త్రివర్ణ పతాకాలతో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రదర్శన

పర్ణశాల: గౌరవ వందనం చేస్తున్న ఆలయ పూజారి, సిబ్బంది, చిన్నారులు

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ కార్యాలయంలో...

దుమ్ముగూడెం: తహసీల్దార్ కార్యాలయంలో...

సారపాక: బ్రిలియంట్ పాఠశాలలో బీఎన్ఆర్..

పినపాక: తహసీల్ కార్యాలయంలో...

పినపాక: మండల పరిషత్ కార్యాలయంలో...

ఇల్లెందు రూరల్ : కొమరారంలో ...

ఒకటో పంపుహౌస్‌ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

పంపుహౌస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి

అశ్వాపురం, ఆగస్టు 15: సీతారామ ప్రాజెక్టులో భాగంగా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన ఒకటో పంపుహౌస్‌ను రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం స్విచ్ ఆన్ చేసి ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌ను ప్రారంభించే అవకాశం తనకు లభించడం సంతోషంగా ఉందని అన్నారు. అలాగే, వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టులో మిగిలి ఉన్న పనులను కూడా పూర్తిచేస్తామని అన్నారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్ పటేల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'సీతారామ'పై సీఎంకు అవగాహన లేదు

పూసుగూడెంలో ఆయన చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం

జిల్లాకు 'సీతారామ' జలాలు ఇచ్చే వరకూ పోరాటం ఆగదు: రేగా

అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్లతో ఉన్న ప్రాజెక్టు శిలాఫలకం

సారపాక/ మణుగూర్ టౌన్, ఆగస్టు 15: సీతారామ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రమూ అవగాహన లేదని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. తమ నియోజకవర్గాలకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు కావాలంటూ అప్పటి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్, అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులను తాను, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ అడగలేదంటూ పూసుగూడెంలో ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలు పచ్చి అబద్ధాలని స్పష్టం చేశారు. సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ, తమ అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురువారం రేగా కాంతారావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'సీతారామ పనులను రూ.8 వేల కోట్లతో 90 శాతం మేర పూర్తిచేసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా?' అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు కోసం ఏనాడూ తట్టెడు మట్టి కూడా పోయని కాంగ్రెస్ పాలకులు.. ఇప్పుడు ఇదంతా వారి ఘనతేనంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి మాయమాటలను గమనిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నిర్మించింది గత కేసీఆర్ ప్రభుత్వమో కాదో తెలుసుకోవాలంటే ఒకసారి ప్రాజెక్టు వద్దకెళ్లి శిలాఫలకాన్ని చూడాలని హితవుచెప్పారు. జిల్లా రైతుల కోసం సాగునీళ్లు అడిగితే అక్రమ అరెస్టులు చేసిన ఈ ప్రభుత్వం సిగ్గుపడాలని విమర్శించారు. సాక్షాత్తూ స్వాతంత్ర్య దినోత్సవం నాడే ఈ ప్రభుత్వానికి నిరసన సెగ ఎందుకు ఎదురైందో ఆలోచించుకోకుండా తమపై నిందలు మోపడం సబబుకాదని అన్నారు. సీతారామ జలాలు జిల్లాకు వచ్చేంతవరకు రైతుల తరపున తమ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 15: అదనపు కట్నం కోసం వేధిస్తుండగా వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాఖూబ్‌అలీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మడిపల్లికి చెందిన పూసురి కల్పనకు నాలుగేళ్ళ క్రితం తిరుమలకుంట గ్రామానికి చెందిన సత్యనారాయణతో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షల కట్నం, రూ.45 వేలు విలువ గల బంగారం, రూ.లక్ష విలువ చేసే గృహోపకరణాలు ఇచ్చారు. కొంతకాలంగా అదనపు కట్నం తీసుకురావాలని భర్త సత్యనారాయణతో పాటు అత్తమామలు శారద, రామయ్య, బావ అశోక్ తరచూ మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలు కల్పన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ప్రజా సమస్యలు అడిగితే అక్రమ అరెస్టులా?

మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ పోశం నర్సింహారావు

మణుగూరు టౌన్, ఆగస్టు 15: సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడమేనా రేవంత్‌రెడ్డి పాలన అని మాజీ జడ్పీటీసీ పోశం నర్సింహారావు ప్రశ్నించారు. గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దండిగల రాజేందర్‌ను అక్రమ అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. పట్టణ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్త పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, పాకాల రమాదేవి, మేకల రవి, ఏనిక ప్రసాద్, కమ్మంపాటి శ్రీను ఉన్నారు.

అరెస్టులు సిగ్గుచేటు

అశ్వాపురం, ఆగస్టు 15: సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతాంగానికి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు నీళ్లు తరలించుకుపోవడానికి ప్రభుత్వం హడావుడిగా చేస్తున్న ప్రారంభోత్సవాన్ని నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టగా వారిని సీఐ అశోక్‌రెడ్డి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ప్రాంతానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇచ్చేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, నాయకులు జాలె రామకృష్ణారెడ్డి, కందుల కృష్ణార్జున్, ఈదర సత్యనారాయణ, గద్దల రామకృష్ణ, చిలకా వెంకటరామయ్య, మేడవరపు సుధీర్, డాక్టర్ బాబు, లోహిత్ పాల్గొన్నారు.

మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రొటోకాల్ రగడ

తహసీల్దార్ సంధ్యారాణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

చంద్రుగొండ, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అధికార పార్టీ నాయకుల అత్యుత్సాహం, అధికారుల ప్రేక్షక పాత్రపై బీఆర్ఎస్ మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తహసీల్దార్ సంధ్యరాణిపై అసహనం వ్యక్తం చేశారు. మండల మెజిస్ట్రేట్ ఉండగా అధికార పార్టీకి చెందిన వారు, కాంట్రాక్టర్లు ఎలా కొబ్బరికాయలు కొట్టేందుకు పిలుస్తారని ప్రశ్నించారు.

అధికార పార్టీ నాయకుల తీరు బాధాకరం..

ప్రోటోకాల్ విషయంలో కొంత గందరగోళం నెలకొంది. మండలంలో అధికారిక కార్యక్రమానికి అధికార పార్టీ నాయకులు గుంపులుగా వచ్చి అధికారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. నాయకుల తీరుపై ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు తెలియజేస్తా. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జెండా ఆవిష్కరిస్తున్న విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి రమేశ్‌బాబు

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 15: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. తొలుత జాతీయ పతాకాన్ని లిటిల్ ఫ్లవర్స్ కళాశాల డైరెక్టర్ మాగంటి రమేష్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేసి స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి దేశంపై ప్రేమ, గౌరవం పెంచుకోవాలన్నారు. అనంతరం లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల చిన్నారులు వివిధ కళారూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి

వన్ టౌన్ ఠాణాను సదర్శించిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

వన్ టౌన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 15 : అత్యవసర సమస్యలతో '100'కు కాల్ చేసిన బాధితుల వద్దకు వెంటనే వెళ్లి వారికి అండగా నిలవాలని తెలంగాణ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. తొలుత స్టేషన్‌కు వచ్చిన ఐజీకి ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించిన ఐజీ తర్వాత అధికారులతో సమీక్ష ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ.. వారి సమస్యల పరిష్కారం కోసం బాధ్యతగా పని చేయాలని సూచించారు. విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలు నిరంతరం రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) పరితోష్ పంకజ్, డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, ఎస్సైలు విజయ, ట్రాఫిక్ ఎస్సై నరేశ్, సిబ్బంది ఐజీ వెంట ఉన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 15: బెల్టు షాపు సమీపంలో యువకుల మధ్య ఘర్షణ జరిగిన ఘటన గురువారం జరిగింది. స్థానికులు కథనం మేరకు.. పట్టణంలోని నెహ్రూబస్తీకి చెందిన ఆల్తాఫ్, వసీమ్ సోదరులకు మౌనిక్ అతని స్నేహితులతో అదే బస్తీలోని బెల్టు షాపు సమీపంలో ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడంతో మౌనిక్ తలకు గాయమైంది. గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై విజయ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకోవడంతో యువకులు పరారయ్యారు. క్షతగాత్రుడిని కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అపశృతి

టేకులపల్లి, ఆగస్టు 15: మండలంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం జేత్రంతండాకు చెందిన కేలోత్ నరేష్ మండలంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఎఫ్ఓఎస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగుర వేసేందుకు ఐరన్ జెండా కర్రను తీసుకొని బ్యాంక్ భవనంపైకి వస్తున్నాడు. భవనానికి దగ్గరగా ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగలు ఐరన్ జెండా కర్రకు తగలడంతో నరేష్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సిబ్బంది వెంటనే సీపీఆర్ చేసి కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ప్రస్తుతం నరేశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

మైనర్‌ను హత్య చేసిన మావోయిస్టులు

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 15 : మావోయిస్టులు బాలుడిని హత్య చేసి అమానవీయంగా వ్యవహరించిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ పోలీసుల కథనం ప్రకారం.. సుక్మా జిల్లాలోని మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా గ్రామమైన పువ్వర్తిలో మావోయిస్టులు వారం రోజుల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన యువకుడితో పాటు 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని సైతం ఇన్ఫార్మర్ నెపంతో హత్య చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపారు. పువ్వర్తి గ్రామానికి చెందిన సోయం ధృవ(19)ను వారం రోజుల క్రితమే పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేశారని, ఈ విషయంలో అతడి కుటుంబీకులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదని పోలీస్ అధికారులు తెలిపారు. కాగా.. మంగళవారం రాత్రి దంతేవాడలోని పల్నార్ రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ధృవ సోదరుడు సోయం శంకర్(16)ను మావోయిస్టులు ఇంటి నుంచి అపహరించి ఆయుధాలతో దాడి చేసి చంపినట్లు తెలుస్తోంది. ఇద్దరు సోదరులను వారం రోజుల వ్యవధిలోని పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో హత్య చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.